క్లుప్తంగా

ఫేక్ కాల్స్‌తో అప్రమత్తం

సీఐ శ్రీనివాస్

పిఠాపురం: తప్పుడు ఫోన్ కాల్స్ చేసి ప్రభుత్వ అధికారులమని నమ్మించి కొందరు అపరిచిత వ్యక్తులు డబ్బులు కాజేస్తున్నారని అలాంటి వాటిపై అప్రమత్తంగా ఉండాలని సీఐ జి.శ్రీనివాస్ ప్రజలకు సూచించారు. ఈ మేరకు ఆయన శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. కొన్ని రోజులుగా కొందరు అగంతకులు అమరావతి నుంచి ప్రభుత్వ అధికారులమని పేర్కొంటూ ఫోన్లు చేసి అమ్మఒడి డబ్బులు గత ఏడాది పడ్డాయా అంటు మాటలు కలిపి ఈ ఏడాది డబ్బులు పడాలంటే మేము అడిగే ప్రశ్నలకు సమాధానం చెప్పాలంటు నమ్మించి వారి ఫోన్లకు ఓటీపీ నంబర్లు పంపి తద్వారా డబ్బులు కాజేస్తున్నారన్నారు. ఇలా నియోజకవర్గంలో పిఠాపురం, కొత్తపల్లి మండలాల్లో పలు చోట్ల పలువురి దగ్గర డబ్బులు కాజేశారన్నారు. దీనిపై బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. ఎవరైనా అపరిచిత వ్యక్తి నుంచి ఫోన్లు వస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. అందరు అప్రమత్తంగా ఉండాలని ఆయన సూచించారు.

సరోజిని కుటుంబానికి ఆర్థిక సాయం



సరోజినీ కుటుంబానికి ఆర్థిక సాయం అందజేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

కొత్తపల్లి: మండలంలోని కొండెవరం ఇందిరా కాలనీకి చెందిన ముప్పిడి సరోజిని ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. తల్లి మృతితో ఆమె కుమారుడు శ్రీను సైతం ఇటీవల గుండెపోటుతో మృతి చెందాడు. వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వంగా గీత ఆదేశాల మేరకు వారి కుటుంబాన్ని శనివారం వైఎస్సార్ సీపీ నాయకులు పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆ కుటుంబానికి 75 కిలోల బియ్యం, రూ.2 వేల నగదు అందజేశారు. పరామర్శించిన వారిలో వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు ఆనాల సుదర్శన్, మండల బీసీ సెల్ అధ్యక్షుడు గింజాల శ్రీనివాస్, వేమగిరి నాని, గాది గంగబాబు, సాకా చిన్నబ్బాయి, బోడపాటి రాజేష్ తదితరులు ఉన్నారు.

పాడా కార్యాలయంలో రేపు పీజీఆర్ఎస్

పిఠాపురం: ప్రజా సమస్యల పరిష్కారం నిమిత్తం ఏర్పాటు చేసిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ (పీజీఆర్ఎస్) ఈ నెల 12వ తేదీ సోమవారం పిఠాపురం మున్సిపల్ గెస్ట్ హౌస్ వద్ద గల పాడా కార్యాలయంలో నిర్వహించనున్నట్లు పాడా పీడీ ఎ.చైత్ర వర్షిణి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆరోజు ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమానికి నియోజకవర్గానికి సంబంధించిన డివిజనల్, మండల స్థాయి అధికారులు అందరూ విధిగా హాజరుకావాలని ఆమె ఆదేశించారు. అర్జీదారులు ఈ విషయాన్ని గమనించి తమ అర్జీలను అందజేయాలని ఆమె కోరారు.

భక్తిశ్రద్ధలతో కనకదుర్గ విగ్రహ ప్రతిష్ఠ



కరప: స్థానిక హైస్కూల్ సెంటర్ వద్ద ఉన్న దుర్గాదేవి ఆలయంలో కనకదుర్గ అమ్మవారి 37వ ప్రతిష్ఠా మహోత్సవాన్ని శనివారం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆలయ అర్చకులు కొంపెల్ల చక్రధరరావు అమ్మవారికి ప్రత్యేక అలంకరణ, పూర్ణాభిషేకం, కుంకుమార్చరణ వంటి పూజాకార్యక్రమాలు చేశారు. భక్తులు సమకూర్చిన వెండి, బంగారు ఆభరణాలతో అమ్మవారిని అలంకరించారు. భజన బృందాలతో ఏకాహం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన అన్నదానానికి పరిసర గ్రామాల నుంచి పది వేల మంది భక్తులు హాజరై అమ్మవారిని దర్శించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

పాకిస్తాన్ జెండా తొలగించాలి

బాలాజీచెరువు: జేఎన్‌టీయూకే ఆవరణలో గత ఏడాది ఇన్‌చార్జి వీసీగా వ్యవహరించిన ప్రొఫెసర్ మురళీకృష్ణ వర్సిటీ పరిపాలన విభాగం ఎదుట ప్రపంచ వ్యాప్తంగా ఉన్న 194 జెండాల జెండాలను ఏర్పాటుచేసి వాటికి క్యూఆర్ కోడ్ ఏర్పాటు చేశారు. ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయడం ద్వారా ఆ దేశ విశిష్టత, భూగోళం, జనాభా తదితర విషయాలన్నీ వచ్చేలా ఏర్పాటు చేశారు. దానిలో భాగంగా పాకిస్తాన్ జాతీయ జెండా ఉండటంతో భజరంగ దళ్, విశ్వహిందూ పరిషత్ సంఘాల ఆధ్వర్యంలో జెండా తొలగించాలంటూ నినాదాలు చేశారు. ముందస్తు జాగ్రత్తగా ఏ విధమైన సంఘటనలు జరగకుండా సెక్యూరిటీ సిబ్బందితో పాటు పోలీసులు అప్రమత్తం అవ్వడంతో వర్సిటీ అధికారుల అదేశాల మేరకూ జెండాను తొలగించారు.

కార్మికులకు వంద రోజుల ఉపాధి

- పనుల్లో అధికారులూ భాగం కావాలి
- సోషల్ ఆడిట్ రాష్ట్ర డైరెక్టర్ శ్రీకాంత్
- రాష్ట్రంలో తొలిసారిగా 'మన ఊరు–పనితీరు' ప్రారంభం



కొండెవరంలో గ్రామ మ్యాప్‌పై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న సోషల్ ఆడిట్ రాష్ట్ర డైరెక్టర్ శ్రీకాంత్

కొత్తపల్లి: ఉపాధి హామీ పథకం పనులలో అధికారులు కూడా భాగస్వాములు కావాలని పథకం సోషల్ ఆడిట్ రాష్ట్ర డైరెక్టర్ జి.శ్రీకాంత్ అన్నారు. రాష్ట్రంలోనే తొలిసారిగా మండలంలోని కొండెవరం గ్రామంలో శనివారం మన ఊరు– పనితీరు, పారదర్శక బోర్డులను ఏర్పాటు చేసే కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ మేరకు గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. మౌలిక సదుపాయాలు, విద్య, కమ్యూనికేషన్, లక్ష్యాలు, ప్రయోజనాలు, నూతన అంశాలపై అవగాహన కల్పించారు. గ్రామ సచివాలయం వద్ద గ్రామ ముఖచిత్రాన్ని ఏర్పాటు చేశారు. అనంతరం ఉపాధి కూలీలతో కలసి కాలువలో పూడిక తీశారు. సచివాలయం వద్ద సమావేశం ఏర్పాటు చేసి ఆయన మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం పనులలో సోషల్ ఆడిట్‌లో రాష్ట్రంలో 45 లక్షల మందిని వారి ఇంటివద్దనే కలవడం, సోషల్ ఆడిట్ నిర్వహించడంలో దేశంలోనే మన రాష్ట్రం మొదటి స్థానంలో నిలిచిందన్నారు. రాష్ట్రంలో సుమారుగా 75 లక్షల జాబ్ కార్డులకు సుమారు 1.26 కోట్ల ఉపాధి శ్రామికులు ఉన్నారన్నారు. 2025 నుంచి ప్రభుత్వం కొత్తచట్టం ప్రకారం జరిగిన ఆడిట్, ఉపాధి పనులకు సంబంధించిన వివరాలను వెబ్‌సైట్‌లో ఉంచిందని, రోజువారీ వేతనంగా రూ.307 ఇస్తున్నట్టు తెలిపారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా జరిగిన 75 శాతం పనులకు కొలతలు తీయడం మన రాష్ట్రంలోనే జరుగుతోందన్నారు. 2024–25 ఆర్థిక సంవత్సరానికి 8.75 లక్షల పనులకు ఆడిట్ నిర్వహించినట్టు తెలిపారు. ఉపాధి పనులు చేసేవారిని శ్రామికులుగా పిలవాలన్నారు. పనికావాలన్న ప్రతి ఒక్కరికీ పని కల్పించాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. ముఖ్యంగా ప్రజలకు అవసరమయ్యే పనులపై దృష్టి పెట్టాలని సూచించారు. ఉపాధి పనులపై అవగాహన కల్పించినపుడే పనులలో అవకతవకలను నియంత్రించవచ్చునని పేర్కొన్నారు. కార్యక్రమంలో సోషల్ ఆడిట్ రాష్ట్ర పరిశీలకులు గౌరీశంకర్, కోనయ్య, సత్యనారాయణ, ఉపాధి హామీ పథకం ఏపీఓ కొండలరావు, ఉపాధి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అరుణోదయ సభలను జయప్రదం చేయండి



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న నాయకులు

పిఠాపురం: అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య 50 వసంతాల ముగింపు సభలను విజయవంతం చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతు కూలీ సంఘం ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రధాన కార్యదర్శి బి.రమేష్ పిలుపు నిచ్చారు. గొల్లప్రోలు జగనన్న కాలనీలో శనివారం ఏఐఎఫ్‌టీయూ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూమి, భుక్తి ఈ దేశ విముక్తి కోసం సాగిన పోరాటాల్లో అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య తన కలలతో ప్రజలను చైతన్య పరుస్తూ కీలక భూమిక పోషించిందన్నారు. సమాఖ్య ఉస్మానియా యూనివర్సిటీలో 1974లో జంపాల చంద్రశేఖర్ ప్రసాద్ సారథ్యంలో పురుడు పోసుకుని 50 ఏళ్ల పూర్తి చేసుకున్న సందర్భంగా 2024 డిసెంబర్లో హైదరాబాదులో పెద్ద ఎత్తున సభలను నిర్వహించారన్నారు. దానికి కొనసాగింపుగా ఈ నెల 12న హైదరాబాదులోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ముగింపు సభ నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఈ సభను ప్రజా కళాకారులు, విప్లవ సానుభూతిపరులు, విద్యార్థి, మేధావులు, కార్మికులు, కర్షకులు పెద్ద ఎత్తున హాజరై జయప్రదం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. మధ్యభారత్ అడుగుల్లో ఆపరేషన్ కగార్ పేరుతో జరుగుతున్న ఆదివాసుల హత్యలు కార్పొరేట్ కంపెనీలకు అడవుల్లోని ఖనిజ సంపదను దోచిపెట్టడానికే అని ఆయన విమర్శించారు. ఆపరేషన్ కగార్‌ను వెంటనే నిలిపివేసి మావోయిస్టు పార్టీతో శాంతి చర్చలు జరపాలని, అలాగే చత్తీస్‌గఢ్‌లోని కర్రగుట్టలను చుట్టుముట్టిన వేలాది మంది సైన్యాన్ని వెనక్కి రప్పించాలని ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వాన్ని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు వల్లూరి రాజబాబు, ఏఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు కుంచె అంజిబాబు, పీడీఎస్‌యూ విజృంభణ రాష్ట్ర కార్యదర్శి కడితి సతీష్, ఏఐఎఫ్‌టీయూ జిల్లా నాయకులు డి.నారాయణ మూర్తి, గొర్ల శివ, కె.శ్రీధర్, వేగిశెట్టి గణేష్ తదితరులు పాల్గొన్నారు.

26 ఏళ్లకు ఆత్మీయంగా కలిశారు..



పాఠశాలలో సందడి చేసిన పూర్వ విద్యార్థులు

కొత్తపల్లి: స్థానిక జిల్లా పాఠశాలకు చెందిన 1998–99 బ్యాచ్ 10వ తరగతి విద్యార్థులు 26 ఏళ్లకు శనివారం ఆత్మీయంగా కలుసుకున్నారు. ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకుని అలనాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. పాఠాలు చెప్పిన అప్పటి ఉపాధ్యాయులు కామరాజు, నాగేశ్వరరావు, వీరభద్రరావు, సత్యనారాయణ, సూర్రెడ్డి, లక్ష్మి, రాంబాబు, ఉమామహేశ్వరరావులను సత్కరించారు. అనంతరం సహపంక్తి భోజనాలు చేశారు. ఈ కలయికకు కృషిచేసిన జోకా ప్రసాద్, అడపా కన్నకుమార్, సానా లక్ష్మణరావు, భుజంగరావు, అన్నపూర్ణ, సునీతలను అభినందించారు.

సైనికుల క్షేమం కోరుతూ పూజలు



పంచారామ క్షేత్రంలో పూజలు చేసిన తుమ్మల పద్మజ తదితరులు

పిఠాపురం: ఆపరేషన్ సిందూర్‌లో పాల్గొంటున్న భారత ఆర్మీ జవాన్లు, దేశ సరిహద్దు గ్రామ ప్రజలు సురక్షితంగా ఉండాలని కోరుకుంటూ శనివారం పిఠాపురంలోని పలు దేవాలయాల్లో బీజేపీ నేతలు పూజలు చేశారు. పిఠాపురం పాదగయ క్షేత్రంలో ఉమా కుక్కుటేశ్వరస్వామి, పూరుహూతికా అమ్మవారు, రాజరాజేశ్వరాదేవి, దాత్తత్రేయ స్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా భారత ఆర్మీ జవాన్లకు వేద పండితుల ద్వారా ఆశీర్వచనాలు అందజేశారు. మన దేశానికి అంతా మంచి జరగాలని, మన భారతదేశం విజయం సాధించాలని ఆ భగవంతుని కోరుకుంటూ రాష్ట్ర బీజేపీ నాయకుల ఆదేశాల మేరకు పూజలు నిర్వహించినట్లు ఈ సందర్భంగా నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శులు దాట్ల వెంకట సూర్యనారాయణ రాజు, గండి కొండలరావు, టౌన్ ప్రెసిడెంట్ ఓలేటి వెంకటేశ్వరరావు, టౌన్ ప్రధాన కార్యదర్శి కంబాల నాగేశ్వరరావు, తోట ఏడుకొండలు, పసుపులేటి సత్యనారాయణ, యాళ్ల కృష్ణారావు, అడబాల వీర మోహనరావు, చింతపల్లి సింహాద్రి, వరద బ్రహ్మాజీ తదితరులు పాల్గొన్నారు.

సైనికుల విజయం కోరుతూ పూజలు

సామర్లకోట: భారత సైనికుల ఆరోగ్య, శక్తి సామర్థ్యాలను పెంచాలని కోరుతూ స్థానిక పంచారామ క్షేత్రం బాలాత్రిపుర సుందరి సమేత కుమరారామ భీమేశ్వర ఆలయంలో సివిల్ సప్లయ్స్ కార్పొరేషన్ డైరెక్టర్ తుమ్మల పద్మజ శనివారం ప్రత్యేక పూజలు చేశారు. ప్రధాని మోదీ ఆధ్వర్యంలో ఆపరేషన్ సింధూర్ విజయవంతమై అందరూ ఆరోగ్యంగా ఉండాలని పూజలు చేశారు. ఆలయ పండితులు స్వామికి అమ్మవారి పూజా కార్యక్రమాలు నిర్వహించి బీజేపీ నాయకులకు ఆశీర్వచనాలు అందజేశారు. బీజేపీ నాయకులు కాటంరెడ్డి ఏడుకొండలు, కాళ్ల దుర్గాప్రసాద్, రాజేష్ తదితరులతో పాటు, విశ్వహిందూ పరిషత్ నాయకులు పాల్గొన్నారు.

ఎస్సీల వర్గీకరణ తగదు

- మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు రాజు



పిఠాపురంలో ర్యాలీ నిర్వహిస్తున్న మాల మహానాడు నాయకులు

పిఠాపురం: ఎస్సీ వర్గీకరణ చేయకూడదని ఆంధ్రప్రదేశ్ మాల మహానాడు అధ్యక్షుడు గుబ్బల రాజు అన్నారు. మాల మహానాడు వ్యవస్థాపక అధ్యక్షులు పీవీ రావు 73వ జయంతి సందర్భంగా పిఠాపురం సూర్యరాయ విద్యానంద గ్రంథాలయంలో శనివారం ఏపీ మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు దారా వెంకట్రావు ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశయాలను ముందుకు సాగిస్తూ, ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా పోరాటం సాధించి సుప్రీంకోర్టులో విజయం సాధించిన పీవీ రావు తన జీవితాన్ని పణంగా పెట్టారన్నారు. రాష్ట్రంలో ఉన్న మాలలను చైతన్యపరిచి చరిత్రలో నిలిచిపోయే మహోన్నతమైన ఉద్యమాన్ని నడిపించి, మరో పక్క సుప్రీంకోర్టులో న్యాయ పోరాటం చేసి ఎస్సీ వర్గీకరణ రాజ్యాంగ విరుద్ధమని సుప్రీంకోర్టు తీర్పు ద్వారా విజయం సాధించిన మహా నాయకుడు పీవీ రావు అన్నారు. పార్లమెంట్‌లో ఏ విధమైన చర్చ జరగలేదని కేంద్ర ప్రభుత్వ ఏ విధమైన సూచనలు ఇవ్వకపోయినా ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఎస్సీలకు వర్గీకరణను అమలుచేస్తూ ఆర్డినెన్స్ విడుదల చేశారన్నారు. భారత రాజ్యాంగంలోని 340 ఆర్టికల్ ద్వారా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ పొందుపరిచిన రిజర్వేషన్లను తొలగించాలనే కుట్రలో భాగమే అన్నారు. ఎస్సీల వర్గీకరణకు మద్దతు తెలిపిన అన్ని రాజకీయ పార్టీలను రాబోయే ఎన్నికలలో ఓడించి తీరుతామని మాలల సత్తా తెలియజేస్తామన్నారు. అనంతరం స్థానిక తహసీల్దారు కార్యాలయం వరకు నిరసన ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో దడాల సత్తిబాబు, కండెల్లి వీరబాబు, ఎడ్ల లక్ష్మీపతి, ముంజవరపు కృపానందం, వడ్డీ ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

నీ ఆశీస్సులే నాకు బలం అమ్మా!

- తల్లులకు కాళ్లు కడిగి ఉపచారాలు
- పిల్లలను ఆశీర్వదించిన మాతృమూర్తులు
- అంగన్‌వాడీల వినూత్న కార్యక్రమం



తల్లుల కాళ్లు కడుగుతున్న పిల్లలు

కాకినాడ క్రైం: అమ్మా.. పూజలందుకో అంటూ పిల్లలు తమ తల్లులను పూజించిన తీరు ఆకట్టుకుంది. ఆదివారం మాతృ దినోత్సవం సందర్భంగా కాకినాడలోని జేపీ–1 సెక్టార్ పరిధిలోని గోళీలపేట అంగన్‌వాడీ సెంటర్‌లో శనివారం తల్లికి వందనం పేరుతో ఈ వినూత్న కార్యక్రమం నిర్వహించారు. ఐసీడీఎస్ పీడీ విజయకుమారి పర్యవేక్షణలో, సీడీపీఓ జ్యోతి ఆధ్వర్యంలో సూపర్‌వైజర్ బత్తిన ప్రభావతి అంగన్వాడీ కార్యకర్తలతో కలసి ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. 25 మంది తల్లులను పిల్లలతో కలిసి కేంద్రానికి పిలిచి పిల్లల చేత కాళ్లు కడిగి, పూజ చేయించారు. అచ్చం అమ్మవారిలా అమ్మకీ పూజాదికాలు నిర్వహించారు. పిల్లలు తమ తల్లుల కాళ్లు కడిగి బట్టతో తుడిచి ఆ నీళ్లను నెత్తిన చల్లుకున్నారు. పిల్లలు తమ తల్లులకి బహుమతులు ఇచ్చారు. మిఠాయిలు తినిపిస్తూ మురిసిపోయారు. అమ్మను అలరించేందుకు నృత్యరూపకాలు ప్రదర్శించారు. తల్లి దీవెనలు కాంక్షిస్తూ మాతృదేవోభవ అంటూ గొంతు సవరిస్తూ పాటలందుకున్నారు. తల్లులు తమకి నేర్పిన మంచి అలవాట్లపై పోస్టర్ ప్రదర్శన చేపట్టారు. అంగన్‌వాడీ టీచర్లు పి.దయావతి, వై.శ్రీవల్లి, కె.సరోజినీదేవి, ఎం.శ్రీనమ్మ, వి.పోసిరత్నం, ఆర్.పార్వతి, పి.సుజాత, ఎం.నూకరత్నంతో పాటు ఎంఎస్‌కేలు, ఏఎన్‌ఎం పాల్గొన్నారు.

యునైటెడ్ సీటీ స్కాన్ సేవలు ప్రారంభం

కాకినాడ క్రైం: కాకినాడ జీజీహెచ్‌లో యునైటెడ్ సీటీ స్కాన్ సేవలు ప్రారంభమయ్యాయి. ఆసుపత్రిలోని సీటీ స్కాన్ కేంద్రంలో ఈ యంత్రాన్ని ఏర్పాటు చేశారు. జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎంపిఆర్ విఠల్ ఈ యంత్రాన్ని ప్రారంభించారు. గతంలో ఉన్న సీటీ స్కాన్ సామర్థ్యం 16 స్లయిసెస్ అయితే నూతన యంత్రం సామర్థ్యం 80 స్లయిసెస్ అని విఠల్ అన్నారు. కచ్చితమైన రోగనిర్ధారణ మరింత సులువవుతుందని తెలిపారు.

డిజిటల్ బోర్డు ఇంటరాక్టివ్ టీవీ ప్రారంభం

కాకినాడ జీజీహెచ్‌లో ఆర్థోపెడిక్ సెమినార్ హాల్లో రాష్ట్ర డీఎంఈ డాక్టర్ డీఎస్‌వీఎల్ నరసింహం డిజిటల్ బోర్డు ఇంటరాక్టివ్ టీవీని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ, వైద్య విద్యా బోధనకు ఎంతగానో సహకరిస్తుందని తెలిపారు. జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ విఠల్, ఆర్ఎంసీ వైస్ ప్రిన్సిపాళ్లు డాక్టర్ శశి, డాక్టర్ ఉమామహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

వేసవిలో విద్యా వికాసం

- విద్యార్థులలో సృజనను వెలికితీస్తున్న పీసీసీ
- ఏటా 250 మందికి శిక్షణ



రాత్రి సమయంలో కర్రసాములో విద్యార్థులు

పెద్దాపురం: వేసవి వేడిలోనూ విద్యార్థులు కొత్త పాఠాలు నేర్చుకుంటున్నారు. పాఠశాల సమయంలో పుస్తకాలు, చదువు, పరీక్షలతో ఆటలకు దూరమయ్యే విద్యార్థులను వేసవి శిబిరాలు అన్ని విధాలా అలరిస్తున్నాయి. విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికి తీసేందుకు పెద్దాపురం చిల్డ్రన్ క్లబ్ (పీసీసీ) ఏటా వేసవి శిక్షణ శిబిరాలు నిర్వహిస్తోంది. మూడేళ్ల పాటు సుమారు 600 మందికి శిక్షణ ఇవ్వగా ఈ ఏడాదీ నెల రోజుల పాటు వివిధ రంగాల్లో నిపుణులతో విద్యార్థులకు శిక్షణ ఇస్తోంది. దీనిలో భాగంగానే గత ఏడాది 150 నుంచి 200 మందికి శిక్షణ ఇవ్వగా ఈ ఏడాది 250 నుంచి 300 మందికి వేసవి శిక్షణ ఇస్తోంది పీసీసీ. ఉదయం 6.30 నుంచి 8 గంటల వరకు, సాయంత్రం 5 నుంచి 7 గంటల వరకు చెట్ల నీడన వరహాలయ్యపేట యానలపు సూర్యారావు భవనం వద్ద ఆహ్లాద వాతావరణంలో విద్యార్థుల కోలాహలం మధ్య శిక్షణ ఉత్సాహంగా సాగుతోంది.

శిక్షణలో మరిన్ని మెళకువలు

ఏటా పీసీసీ ఆధ్వర్యంలో వేసవి శిక్షణ శిబిరంలో మరిన్ని మెళకువలు నేర్పిస్తారు. వారిలో ఉన్న మేధస్సును గుర్తించి ఆయా రంగాల్లో పూర్తి స్థాయిలో శిక్షణ ఇస్తున్నారు. విద్యార్థులు వేసవి కాలంలో టూర్‌ల పేరుతో సమయాన్ని వృధా చెయ్యకుండా, వేసవి అలసట తెలియకుండా ఉత్సాహ వాతావరణంలో శిక్షణ ఇవ్వడమే పీసీసీ లక్ష్యంగా పనిచేస్తోంది.

సెల్ఫ్ డిఫెన్స్‌కు ఉపయోగపడుతుంది



వేసవి శిబిరాలతో మాకు ఆత్మరక్షణ నేర్పుతున్నారు. మ్యాథ్స్ బేసిక్స్ నేర్చుకుంటున్నాం. ఉదయం నేర్పించే కరాటే ఆసక్తిగా ఉంది. ఆరోగ్యం, మానసికోల్లాసానికి శిక్షణ ఎంతగానో ఉపయోగపడుతుంది.

– హాసిని అమృత ప్రియ, 9వ తరగతి విద్యార్థి, పెద్దాపురం

కథలు రాయాలని ఉత్సాహంగా ఉంది



నాకు కథలు అంటే చాలా ఇష్టం. కరాటే నేర్చుకోవాలని ఉండేది. వేసవి శిబిరంలో కరాటే శిక్షణ పొందుతున్నా. అన్ని రంగాల్లో శిక్షణ ఇస్తున్నారు. ఇప్పుడు కథలు రాయాలనే ఆశ మరింత పెరగడమే కాకుండా రాయగలను అనే పూర్తి విశ్వాసం కల్గింది.

– డి.కార్తీక్, 7వ తరగతి విద్యార్థి, పెద్దాపురం

వికాసమే శిబిరాల లక్ష్యం



వేసవి సెలవుల్లో విద్యార్థులు టీవీ, మొబైల్ ఫోన్లకు అతుక్కుపోకుండా విద్యార్థుల ఆలోచనలో మార్పు తీసుకురావాలనే మా ప్రయత్నం. విజ్ఞానం, వినోదం, వికాసాన్ని విద్యార్థులకు అందజేయడమే లక్ష్యంగా పీసీసీ వేసవి శిక్షణ శిబిరాన్ని రెండో ఏడాదీ కొనసాగించాం. ప్రశ్నించడం ద్వారా మాత్రమే కొత్త అంశాలను తెలుసుకోగలమని తెలపడమే పీసీసీ ప్రధాన లక్ష్యం.

– రొంగల అరుణ్, పీసీసీ కార్యదర్శి పెద్దాపురం

తోబుట్టువుల్లా నర్సుల సేవలు



సమావేశంలో పాల్గొన్న హెడ్ నర్సులు

- జీజీహెచ్ సూపరింటెండెంట్ విఠల్

కాకినాడ క్రైం: రోగులకు తోబుట్టువుల్లా నర్సులు సేవలందిస్తారనీ, ఆసుపత్రిలో రోగులకు అధిక సమయం సేవలందించేది వారేనని జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎంపీఆర్ విఠల్ అన్నారు. శనివారం జీజీహెచ్‌లోని కాన్ఫరెన్సు హాల్లో హెడ్ నర్సులతో సమావేశం నిర్వహించారు. డిప్యూటీ సీఎస్ఆర్ఎంవో డాక్టర్ వానపల్లి వరప్రసాద్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో డాక్టర్ విఠల్ మాట్లాడుతూ, నర్సింగ్ సేవల్లో మరింత నాణ్యతను పెంపొందించేందుకు శాస్త్రీయ విధానాలను అవలంబిస్తున్నట్లు తెలిపారు. రోగులకు వైద్యుడి కంటే నర్సే అధిక సమయం సేవలందిస్తారని, వారు అందిస్తున్న సేవల్లో మరింత నాణ్యతను వృద్ధి చేయడం ద్వారా రోగులు సంతృప్తి చెంది త్వరగా కోలుకుంటారన్నారు. సేవలందించడంలో నర్సులకు ఎదురవుతున్న సాధారణ ఆటంకాలు, సమస్యలపై దృష్టి సారించామన్నారు.

మందుల లభ్యత, పరికరాల పనితీరు తదితర అంశాలను పరిశీలించి వారి సేవలకు మరింత చేయూతనిచ్చేలా ప్రణాళికలు రచించి అమలు చేస్తున్నామన్నారు. అయితే, రోగులకు అత్యుత్తమ సేవలు అందించేందుకు నర్సులు మరింతగా కట్టుబడి ఉండాలని సూచించారు. తగిన జ్ఞానాన్ని పెంపొందించుకుని వృత్తిలో రాణించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీనివాసన్, ఏఆర్ఎంవో డాక్టర్ వై.లావణ్య, నర్సింగ్ సూపరింటెండెంట్లు సంధ్యారాణి, ఫ్లోరెన్స్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పండిత సదస్యం

కాకినాడ రూరల్: సర్పవరంలో రాజ్యలక్ష్మి సమేత భావనారాయణ స్వామి వారి కల్యాణ మహోత్సవాలలో భాగంగా శనివారం పండిత సదస్యం ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు స్వాములు ఆలయ ప్రాంగణంలో మండపంలో స్వామి వారిని ఉంచి పండిత సదస్యం చేశారు. ఉత్సవాలలో భాగంగా ఉదయం ప్రత్యేక పూజలు, హోమం, సాయంత్రం ఊరేగింపు నిర్వహించారు.